క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని దర్గాపేటలో ఆల్‌కౌసర్ సేవా సంస్థ అధ్యక్షుడు అహ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల సంస్థ అధ్యక్షుడు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా సయ్యద్ ముస్తాక్, జిక్రియా సాహెబ్ పాల్గొన్నారు.

బార్ ఏర్పాటుకు రీనోటిఫికేషన్

మడకశిర: పట్టణంలో బార్ ఏర్పాటుకు ప్రభుత్వం రీనోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మురళికిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు బార్ ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినా ఎవరూ కూడా దరఖాస్తులు చేసుకోలేదన్నారు. దీంతో ప్రభుత్వం మళ్లీ రీనోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈనెల 14లోగా బార్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సెంట్రల్ లైటింగ్‌కు భూమిపూజలో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ: పెనుకొండ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామాత్యులు సవిత పేర్కొన్నారు. రూ.92 లక్షలతో పట్టణంలోని జాతీయ రహదారి నుంచి మార్కెట్‌యార్డ్ వరకూ మున్సిపల్, అహుడా నిధులతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పెనుకొండకు ఐటీ కళాశాల సైతం మంజూరైందన్నారు. త్వరలోనే అర్హులైన పేదలకు హౌసింగ్ కింద ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, పబ్లిక్ హెల్త్ రామ్మోహన్‌రెడ్డి, నగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, కమిషనర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీల ఢీ .. డ్రైవర్‌కు గాయాలు



దెబ్బతిన్న లారీ

పెనుకొండ రూరల్: రైల్వేగేటు పడటంతో ఆగి ఉన్న లారీని మరోలారీ ఢీకొన్న ఘటన పెనుకొండలో శుక్రవారం చోటు చేసుకుంది. హిందూపురం నుంచి అనంతపురం వైపు పెయింట్ లోడుతో వెళ్తున్న లారీ పెనుకొండ పరిధిలోని పెద్ద చెరువుకట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆగి ఉన్న మరో లారీని ఢీ కొంది. తమిళనాడుకు చెందిన డ్రైవర్ శరవణ్ గాయపడగా పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కియా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రొద్దం



ట్రోఫీ అందుకుంటున్న రొద్దం జట్టు సభ్యులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ ఫైనల్‌లో రొద్దం జట్టు విన్నర్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎన్‌పీ కుంట జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 115 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రొద్దం జట్టు 11 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి లక్ష్యం ఛేదించింది. రొద్దం జట్టు కెప్టెన్ నరేష్‌కుమార్ 60 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. యూటీఎఫ్ నాయకులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్, ఎంఈఓ రాఘవయ్య, వాణి విజేతలకు బహుమతులు అందజేశారు.

అనంత పద్మనాభస్వామి వ్రతం



వ్రతాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మడకశిర: పట్టణంలో శుక్రవారం గాంధీబజార్‌లో అనంతపద్మనాభస్వామి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు గణేష్ మండపంలో ఈవ్రతాన్ని చేపట్టారు. అనంతపద్మనాభస్వామి చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు.

పెద్దాస్పత్రికి అనారోగ్యం

- పనిచేయని సిటీ స్కాన్ యంత్రం
- సమయపాలన పాటించని అధికారులు
- జిల్లాస్థాయి ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత
- నేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



హిందూపురం సర్వజనాస్పత్రి

హిందూపురం టౌన్: హిందూపురం ప్రభుత్వాస్పత్రి జిల్లాకే పెద్దదిక్కు. పేదలకు ఏ అనారోగ్య సమస్యలు వచ్చినా వచ్చేది ఇక్కడే. అయితే వైద్యులు, సిబ్బంది కొరత, పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందుతుందన్న ఆశ ప్రజల్లో రోజు రోజుకూ సన్నగిల్లితోంది.

వేచిచూస్తేనే ఓపీ..

హిందూపురం నియోజకవర్గంతో పాటు మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల నుంచి రోగులు హిందూపురం సర్వజనాస్పత్రికే వస్తుంటారు. అయితే ఓపీ కోసం వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు. ఓపీ కోసం నిరీక్షిస్తేనే వైద్యుడి దర్శనం దొరికే పరిస్థితి నెలకొంది. ఓపీ చీటీలు ఇవ్వడానికి ప్రత్యేక కౌంటర్లు ఉన్నప్పటికీ ఓపీ స్లిప్పులు పొందడానికి రోగులు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. తీరా ఓపీ స్లిప్పులను పొంది వైద్యుడికి వద్దకు వెళ్తే ఒక్కోసారి సమయం అయిపోయిందని వైద్యులు వెళ్లిపోయినట్లు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమర్జెన్సీ వద్దకు వెళ్తే మీరు ఓపీలోనే చూపించుకోవాలని, ఇక్కడ చూడమంటూ అక్కడి సిబ్బంది చెబుతున్నారని వాపోతున్నారు. ఇది ఇలా ఉంటే ఓపీకి వచ్చే రోగులకు ఎక్స్‌రే, ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించి మళ్లీ డాక్టర్లను కలవాలంటే అప్పటికే ఓపీ సమయం మించి పోయి వైద్యులు వెళ్లిపోయింటారు. దీంతో మరుసటి రోజు రావాల్సి వస్తోందని చెబుతున్నారు. రక్తపరీక్షలు చేయించినా మధ్యాహ్నం 3 గంటలపైన రిపోర్టులు ఇస్తుండడంతోనూ రోగులకు సమస్యగా మారింది.

రోగులకు తప్పని అవస్థలు

కొందరు వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో విధుల్లో ఉన్నప్పటికీ సీట్లలో ఉండకపోవడంతో జిల్లా ఆస్పత్రిలో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. ముఖ్యంగా చిన్నపిల్లల ఓపీకి 250 మంది దాకా సగటున రోగులు వస్తుంటారు. అలాగే 70 నుంచి 100 మంది దాకా పిల్లలు అడ్మిట్‌లో ఉంటారు. వైద్యులు ఓపీ మొదలైన గంట తరువాత వస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఓపీ ముగిసిన తరువాత వెళితే జిల్లా ఆస్పత్రిలో ఎమర్జెన్సీ మినహా ఇతర వైద్య సేవలు దొరకడం లేదు. అలాగే కాన్పుల వార్డులో రెఫర్‌లు ఎక్కువ చేస్తున్నారని రోగులు చెబుతున్నారు.

మూలనపడిన సిటీ స్కాన్ యంత్రం

ఆస్పత్రిలో సిటీ స్కానింగ్ యంత్రం కొన్నేళ్లుగా మూలనపడింది. రోజుకు 50 మందికి స్కానింగ్ అవసరం ఉంటుంది. దీంతో వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులకు పంపుతుండడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు రకాల స్కానింగ్‌లకు రూ.800ల నుంచి 6 వేల వరకు రోగులు వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు.

మార్చురీ కరువు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన మార్చురీ లేకపోవడంతో పోస్టుమార్టం చేయడంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆస్పత్రిలో ఉన్న మార్చురీ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో మార్చురీ పక్కనే ఉన్న దోబీ గదినే ప్రత్యామ్నాయంగా మార్చురీగా ఉపయోగించుకుంటూ పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పడకల సంఖ్య : 200
రోజు అవుట్ పేషంట్లు – 1000 దాకా
ఆస్పత్రిలో ఉండే ఇన్ పేషంట్లు – 120 దాకా
ఆస్పత్రిలో ఉండాల్సిన వైద్యులు – 42
ప్రస్తుతం ఉన్న వైద్యులు – 32
ఉండాల్సిన పారామెడికల్ స్టాఫ్ – 31
ప్రస్తుతం ఉన్న పారామెడికల్ స్టాఫ్ – 28
ఉండాల్సిన నర్సింగ్ స్టాఫ్ – 47
ప్రస్తుతం ఉన్న నర్సింగ్ స్టాఫ్– 36

మృతదేహాలను నిల్వ ఉంచడానికి సరైన సదుపాయాలు లేవు.

మరిన్ని సమస్య ఇలా..

- ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలుపుతుండడంతో అంబులెన్సులు వచ్చి పోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- మాతాశిశు కేంద్రం పైభాగంలో క్రిటికల్ కేర్ నిర్మాణం పనులు నత్తనడకన సాగుతూనే ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- వర్షం వచ్చినప్పుడల్లా ఆస్పత్రి ముందుభాగంలో నీరు నిలిచి ఉంటుండడంతో రోగులు అవస్థ పడుతున్నారు.

నేడు అభివృద్ధి కమిటీ సమావేశం

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరగనుంది. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపీ చీటీల విభాగాన్ని కలెక్టర్ ప్రారంభించనున్నారు. అలాగే ఆస్పత్రి అభివృద్ధి, సమస్యలపై చర్చించనున్నారు.

నేడు మడకశిరలో గణేశ్ నిమజ్జనోత్సవం

- భారీగా పోలీస్ బందోబస్తు
- మడకశిర చెరువులో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు



మడకశిరలో పూజలందుకుంటున్న గణనాథుడు

మడకశిర: మడకశిరలో శనివారం గణేశ్ నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మున్సిపల్, పోలీస్ అధికారులు చేస్తున్నారు. ప్రధానంగా నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా పూర్తి చేయడానికి పోలీసులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక సీఐలు రాజ్‌కుమార్, నగేష్, ఐదు మండలాల ఎస్ఐలు, ఏఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి కూడా బందోబస్తుకు పోలీసులను రప్పిస్తున్నారు. ఇదిలా ఉండగా సాయంత్రం 4 గంటలకు గణేష్ నిమజ్జనోత్సవ కార్యక్రమం ప్రారంభం కానుంది. పట్టణంలోని అన్ని గణేష్ విగ్రహాలు తొలుత ఊరేగింపుగా వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకుంటాయి. ఆ తర్వాత శోభాయాత్ర ప్రారంభమవుతుంది. మడకశిర చెరువులో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి చెరువు వద్ద క్రేన్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. మడకశిర పట్టణ సీఐ నగేష్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తి చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తి చేయడానికి పోలీసులకు సహకరించాలని కోరారు.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



పోలీస్‌స్టేషన్ వద్దకు కమిటీ సభ్యులతో కలసి వెళుతున్న ఈరలక్కప్ప, అనంతరాజు

రొళ్ల: పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రానికి చేరుకుని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుతో పాటు వినాయక కమిటీ సభ్యులతో కలిసి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ టీడీ పల్లి ఎస్సీ కాలనీలో కొలువుదీరిన వినాయక విగ్రహాన్ని కాలనీకి చెందిన యువకులు ఊరేగింపుగా గురువారం రాత్రి రొళ్ల బస్టాండ్ వద్దకు తీసుకొచ్చారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌కు సంబంధించిన పాటలకు యువకులు డ్యాన్స్ చేశారు. అయితే పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి గురువారం రాత్రి వినాయక విగ్రహాన్ని రొళ్ల బస్టాండ్ వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి న్యూసెన్స్ చేశారని ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చాయని చెప్పారన్నారు. పోలీసులు అధికార పార్టీ నాయకుల చెప్పుచేతల్లో ఉండకుండా నిష్పక్షపాతంగా వ్యవరించి ప్రజలకు న్యాయం చేయాలని ఈరలక్కప్ప సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కమిటీ సభ్యులకు పోలీసులు తెలియజేయడంతో అందరు ఇళ్లకు చేరుకున్నారు. వినాయక కమిటీ సభ్యులకు ఈరలక్కప్ప, అనంతరాజుతో పాటు వివిధ గ్రామాల పార్టీ శ్రేణులు అండగా నిలవడంతో పార్టీ కార్యకర్తలు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సర్పంచులు సదాశివప్ప, ప్రకాష్, నాయకులు నగేష్‌రంగారెడ్డి, మహంతేష్, మధు, మంజునాథ్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



గుడిబండ: జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రంగనాథ్



పెనుకొండలో ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



లేపాక్షి: ముద్దుక్రిష్ణ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెనుకొండ: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎంఈఓ రాఘవయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎంఈఓతో పాటు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు బసిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నారాయణస్వామి, రవీంద్ర, నరేష్‌బాబు, పెద్దిరాజు, ఉపేంద్ర, హసీనా, సవితమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న జి. కృష్ణారెడ్డిని సహచర ఉపాధ్యాయులు శ్రీనివాస్, యంజేరప్ప, విశ్వేశ్వర, వీరనాగప్ప, లింగన్న, తదితరులు క్రిష్టారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సీనియర్ ఉపాధ్యాయులు రామక్రిష్ణ, దేవరాజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్, కోశాధికారి ప్రదీప్ కుమార్, మండల అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షులు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చేసిన సేవలను కొనియాడారు.

గుడిబండ: మండల పరిధిలోని మందపల్లిలో ఉన్న ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రంగనాథ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంగళకర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గురు పూజోత్సవ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు రంగనాథ్‌ను అభినందించారు.

లేపాక్షి: లేపాక్షిలోని జిల్లా పరిషత్ ఉర్దు ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ నేటి సమాజంలో కీలకమైన పాత్ర గురువులదేనన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముద్దుక్రిష్ణ ఉపాధ్యాయ దంపతులను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంఈఓ –2 కుళ్లాయప్ప, విశ్రాంత ఉపాధ్యాయులు విశ్వేశ్వరయ్య, రాజేశ్వరీదేవి, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు కొండారెడ్డి, నాగసాయినాథ్, ఫణిభూషణ్‌రావు, రమణకుమార్, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ మిలాద్ ఉన్ నబీ వేడుకను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని మసీద్ కమిటీల ఆధ్వర్యంలో ముస్లింలు పవిత్ర మక్కా , మదీనాల నమూనాలతో ఊరేగింపులు నిర్వహించారు. ప్రవక్త సూచించిన మార్గంలో నడుస్తూ సర్వమానవాళిని ప్రేమిస్తూ కులమతాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించుకోవాలని మౌలానాలు సూచించారు.



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



పావగడ: ముస్లింల ర్యాలీలో పాల్గొని మతసామరస్యాన్ని చాటుతున్న అర్చకులు



అమరాపురంలో..



అగళిలో...



గుడిబండ: జాతీయ జెండాను ఊరేగిస్తున్న ముస్లింలు

'సాక్షి' విలేకరికి కమిషనర్ బెదిరింపులు

చిలమత్తూరు: 'బెంగళూరులో మృతి .. పురంలో సర్టిఫికెట్ ' శీర్షికన గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై విచారణ ఎదుర్కోవాల్సిన కమిషనర్ మల్లికార్జున 'సాక్షి' విలేకరిని బెదిరించారు. నిరాధార కథనాలు ఎలా రాస్తారు? మున్సిపాలిటీ ప్రతిష్టకు భంగం కలిగించారంటూ గుర్రుమన్నారు. ఆధారాలున్నాయి కదా అంటే నేరుగా ఆస్పత్రికి వెళ్లి కనుక్కోండంటూ బుకాయించారు. వివరణ కోసం సాక్షి ప్రయత్నించిన సందర్భంలో తప్పు అని ఒప్పుకున్న కమిషనర్ వార్త ప్రచురితమైన రెండోరోజు సాక్షి కథనం తప్పు అని మాట్లాడటం వెనుక అంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. శంకరాచారి అనే వ్యక్తి బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో మృతి చెందారు. దీనిపై కాజ్ ఆఫ్ డెత్ సర్టిఫికెట్‌ను కూడా జారీ చేశారు. అయితే హిందూపురంలోనే మరణించాడంటూ ఇక్కడ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారో కూడా కమిషనర్ సమాధానం చెప్పాల్సి ఉంది. వాటికి సమాధానం చెప్పకుండా 'సాక్షి'పై ఆరోపణలు చేయడం తగదని పలువురు ఖండిస్తున్నారు.

'పురం'లో పూర్తవని నిమజ్జనోత్సవం



గుడ్డం కోనేరులో భారీ గణేశుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం వినాయక నిమజ్జనోత్సవం రెండోరోజైన శుక్రవారం కూడా పూర్తి కాలేదు. వాహనాలపై కొలువుదీర్చిన విగ్రహాలకు వెల్డింగ్ చేసి ఉండటంతో గుడ్డం కోనేరు వద్దకు రాగానే తిరిగి గ్యాస్ కట్టర్లతో కడ్డీలను కత్తిరించడంలో ఆలస్యమైంది. ఇంకా నాలుగైదు భారీ విగ్రహాలను నిమజ్జనం చేయాల్సి ఉంది. శనివారం ఉదయం నిమజ్జనం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

పలువురికి గాయాలు

బాలాజీ సర్కిల్ వద్ద బాణాసంచా కాల్చడంతో నిప్పురవ్వలు ఎగిరిపడటంతో 9 మందికి గాయాలు అయ్యాయి. అలాగే అంబేడ్కర్ కూడలి వద్ద బిల్డింగ్ పెచ్చులూడి కిందపడిపోవడంతో ఇద్దరి గాయాలయ్యాయి.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

హిందూపురం: హిందూపురం ముదిరెడ్డిపల్లిలోని నందినిసర్కిల్ సమీపంలో నూతనంగా నిర్మించనున్న చౌడేశ్వరీదేవి ఆలయం నిర్మాణానికి భూమి పూజలు చేశారు. శుక్రవారం బెంగళూరుకు చెందిన ప్రముఖ వేద పండితులు సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో నందిని సర్కిల్‌లో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మద్దన జయరాములు, ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

మడకశిర: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జైలు నుంచి విడుదల కావాలని ఆకాంక్షిస్తూ శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూజల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

గోరంట్ల: స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండలంలోని బలిజ సంఘం నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.